క్లుప్తంగా

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ

ఉయ్యాలవాడ: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి శైలజ సూచించారు. గురువారం స్థానిక రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల ఎత్తు, బరువు, ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలన్నారు. నెలలో 3 రకాల గుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, కచ్చితంగా కేటాయించిన రోజులలో అదే రంగు ఉన్న గుడ్లను అందించాలన్నారు. నిర్లక్ష్యం వహించే కార్యకర్తలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

దోమల మందు పిచికారీ

దొర్నిపాడు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో దోమలను నివారించేందుకు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాల సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్ గురువారం డీడీటీ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మందును పిచికారీ చేయడం వల్ల దోమలను పూర్తి స్థాయిలో నివారించవచ్చన్నారు. వసతి గృహం సంక్షేమాధికారి రాముడు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

నంద్యాల(రూరల్): పట్టణంలోని డి2 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వినియోగదారులు తమ పెండింగ్ విద్యుత్ బిల్లులను ఈనెల 15వ తేదీలోగా చెల్లించాలని ఏఈ రామయ్య గురువారం తెలిపారు. బిల్లులు చెల్లించని వినియోగదారులకు 16వ తేదీ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు.

ఎర్రగుడిదిన్నె పాల సొసైటీ సభ్యత్వం తొలగింపు

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీ యూనియన్ నిబంధనలు అతిక్రమించిన ఎర్రగుడిదిన్నె పాల సొసైటీని సభ్యత్వం నుంచి తొలగించినట్లు డెయిరీ ఎండీ పరమేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన బోనస్‌ను ఇచ్చేందుకు ఎర్రగుడిదిన్నె రికార్డులను పరిశీలించామన్నారు. 15-10-2022 నుంచి 30-11-2022 వరకు యూనియన్‌కు పాలను సరఫరా చేయలేదని, రైతుల నుంచి సేకరించిన పాలను ఇతరులకు విక్రయించినట్లు తెలియడంతో డెయిరీ సభ్యత్వం నుంచి తొలగించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ఉయ్యాలవాడ: ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగితే తల్లీ, బిడ్డ ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృ సురక్షిత యోజన పథకంలో భాగంగా గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలో 60 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే ప్రోత్సాహక నగదుతో పాటు ప్రసవం అయిన తర్వాత ఆరోగ్య కేంద్రం నుంచి తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా వారి గృహాలకు చేర్చుతారన్నారు. గర్భవతులకు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని దీనిపై ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీ నంది ఆగ్రో ఏజెన్సీస్ దుకాణంలో రూ.1.35 లక్షల విలువ గల పురుగు మందుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు నంద్యాల మండల వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం మండలంలోని పలు పురుగు మందుల ఏజెన్సీలను తనిఖీ చేశామని, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల సబ్ డివిజన్‌లో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను నేడు ఎస్పీ కార్యాలయ సమీపంలో వేలం వేస్తున్నట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం తరలిస్తూ పట్టుబడిన 24 బైకులు, 11 ఆటోలు, 6 కార్లు మొత్తం 41 వాహనాలను వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో వాహనాలను దక్కించుకున్న వారు జీఎస్టీ చెల్లించాలని వివరించారు. వివరాలకు సెల్ 94906 02431 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

వేతనాలు సక్రమంగా చెల్లించాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ కాంట్రాక్ట్ ఏజెన్సీ కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి ఒప్పందం ప్రకారం నెలకు రూ.16 వేలు వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా వేతనాలు చెల్లిస్తున్నారని, సకాలంలో వేతనాలు అందేలా చూడాలంటూ గురువారం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని, ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి చేసిన మేలును వివరిద్దాం

- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల దిశానిర్దేశం
- 11 నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



హాజరైన గృహసారథులు,వలంటీర్లు

ఆళ్లగడ్డ: గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ధైర్యంగా వెళ్లి లబ్ధిదారులకు వివరిద్దామని గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం చాగలమర్రిలోని కేజీఎస్ ఫంక్షన్ హాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామన్నారు. గృహసారథులు, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిన తీరును వివరించాలన్నారు. అలాగే అర్హత ఉండి ఎదైనా పథకం రాకపోతే ఎందుకు రాలేదో? ఎప్పుడు వస్తుందో? వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సూచించారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 11 నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలను వివరించి ఇంటికి స్టిక్కర్ అతికించి వాటిపై ఉన్న ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ చేయాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వసనీయత కలిగేలా వివరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు అందాయి? ప్రస్తుతం ఎలాంటి పథకాలు ఇస్తున్నారు, ఒక్కో ఇంటికి ఎంత మేర లబ్ధి చేకూరిందన్నది క్షుణ్ణంగా వివరించాలన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో కేవలం టీడీపీ నాయకులకే పథకాలు అందేవని, ప్రస్తుతం కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేశామన్నారు. త్వరలో జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో శాసన మండలి అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గం పరిశీలకుడు నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, గణేష్ రెడ్డి, నరసింహారెడ్డి, దస్తగిరి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సేవకులకు దుస్తుల పంపిణీ



బోయిలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులను దర్శించుకున్న జిలా ఎస్పీ రఘువీర్ రెడ్డి అనంతరం స్వామివార్ల ఉత్సవ పల్లకీని మోసే బోయలు, సాధువులు, యాచకులకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. అహోబిలం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, పోలీసులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణపై అవగాహన

గోస్పాడు: మాతా శిశు సంరక్షణపై అవగాహన కల్పించాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా గర్భవతులకు వైద్య పరీక్షలతో పాటు వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తక్కువ ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. రక్తహీనత వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షితమైన ప్రసవం అయ్యేందుకు వారం రోజులు ముందుగానే ఆసుపత్రిలో అడ్మిట్ కావాలని సూచించారు. తల్లీబిడ్డ సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు, కాన్పు తర్వాత ఆరోగ్య ఆసరా ఆర్థిక ప్రయోజనంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

హామీలన్నీ అమలుచేసిన ఘనత జగనన్నదే

శిరివెళ్ల: గత సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి అన్నారు. గురువారం శిరివెళ్లలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. 1, 4వ గ్రామ సచివాలయాల పరిధిలోని 1, 17, 18 వార్డులు డేగలపేట, ఎస్సీ కాలనీ, ముబారక్ పేటలో ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మూడున్నరేళ్లలో 98.5 శాతం హామీలను నెరవేర్చిందని, మాట తప్పని మడప తిప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద శాతం హామీలు నెరవేర్చాలనే కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా ఒక్క రూపాయి లంచం లేకుండా సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దకే చేరుస్తున్నామన్నారు. లంచాలు, నాయకులు, దళారుల జోక్యంలేకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. శిరివెళ్లలో 750 మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరయ్యాయన్నారు. 950 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక, 90 మందికి కాపు నేస్తం, 1,800 మందికి అమ్మఒడి, 86 మంది ఆటో డ్రైవర్లకు సాయం, 145 మందికి జగనన్న తోడు, 347 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, 987 మంది చేయూత పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని గణాంకాలతో వివరించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా టీడీపీ క్రియాశీలక కార్యకర్త డేగల హమీద్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, దొర్నిపాటి రఫీ, ముల్లా అన్వర్‌బాషా, ముడిమాల నాగరాజు, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, సర్పంచ్ సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఇందూరి ప్రతాపరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిరివెళ్లలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ప్రజారోగ్యానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): వైద్యులు, పాత్రికేయ రంగం వారు పరస్పర సహకారంతో ప్రజారోగ్యం కోసం కృషి చేయాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ సూచించారు. గురువారం స్థానిక మధుమణి నర్సింగ్ హోం సమావేశ భవనంలో వైద్యులు, పత్రికా విలేకరులకు సమావేశం నిర్వహించారు. పాత్రికేయ రంగం సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. స్థానికంగా ప్రజలకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్న వైద్యులను అభినందించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం, లోపాలు జరిగాయని భావించిన పక్షంలో రోగి బంధువులు ఐఎంఏ కమిటీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని, లేదా వినియోగదారుల చట్టాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు. తప్పు నిర్ధారణ కానంత వరకు ఆసుపత్రి, వైద్యుడి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వార్తలు ప్రచురించరాదని ఐఎంఏ తరఫున విలేకరులకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ జఫరుల్లా, చంద్రశేఖర్, ఫణిల్, సహదేవుడు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నిధుల కోతపై నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించడంపై వ్యవసాయ కార్మికులు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. గాంధీచౌక్‌లోని హెడ్ పోస్టాఫీసు వద్ద జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కూలీలు, కార్మికులకు నిధులు తగ్గిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. వ్యవసాయ రంగానికి గత బడ్జెట్ కంటే నిధులు తగ్గించి రైతుల నడ్డి విరిచారన్నారు. ఎరువులకు ఇవ్వాల్సిన సబ్సిడీలు తగ్గించి ఎఫ్‌సీఐ ధాన్యం సేకరణ కేంద్రాలకు నిధులు పెంచాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించి రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. నాయకులు పుల్లా నరసింహులు, సురేష్, వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, బంగారు, వెంకటలింగం, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీర్చాలని వినతి



మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసాకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్డీపీఐ నాయకులు

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజల నీటి కష్టాలను తీర్చాలని ఎస్డీపీఐ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ అతావుల్లా ఖాన్ కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసుకు వినతి పత్రం అందజేశారు. అతావుల్లా ఖాన్ మాట్లాడుతూ.. నడిగడ్డ, మాల్‌దార్‌పేట, వీసీ కాలనీ, దేవనగర్, సాయిబాబా నగర్, గుడిపాటి గడ్డ తదితర ప్రాంతాల్లో నీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కరీముల్లా, కార్యవర్గ సభ్యులు ఇస్మాయిల్, హసీనాబాను, అబ్దుల్ రజాక్, సనావుల్లా పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులు అరికట్టాలి



కుంభా రవిబాబుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలోని దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆ సమాఖ్య గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాన్ని పోలీసు వ్యవస్థ సరైన పద్ధతిలో నడిపేలా చర్యలు తీసుకోవాలంటూ గురువారం నంద్యాల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గిరిజనుల భూములు అనుభవిస్తున్న ధనవంతులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాల్లో ఇతరులకు ప్రాధాన్యత కల్పించకుండా రాజ్యాంగపరమైన హక్కులను కల్పించాలన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్, నాయకులు ఇమ్మానియేల్, మధుబాబు, సుబ్బరాయుడు, ఎల్లయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తదితరులు

నంద్యాల(అర్బన్): గిరిజనుల ఆరాధ్య దైవం సత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఆలిండియా బంజార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ కోరారు. సేవాలాల్ మహారాజ్ 254వ జయంతి సందర్భంగా చలో సేవా గడ్ ఆహ్వాన పత్రికల పోస్టర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో సంఘం నాయకులు విడుదల చేయించారు. అనంతరం వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ ఈనెల 13, 14, 15 తేదీల్లో సేవా ఘడ్‌లో జరిగే ఉత్సవాలకు బంజారాలు వేలాదిగా పాల్గొని మహారాజ్ ఆశీస్సులు పొందాలన్నారు. సంఘం సభ్యులు బిలావత్ శంకర్ నాయక్, విక్రం సింహనాయక్, కృష్ణనాయక్, విజయనాయక్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

గోస్పాడు: చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని నంద్యాల డీటీసీ సెంటర్ డీడీఏ జయదేవ్ అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో గురువారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు వంటి పైర్లు సాగు చేసి మానవ ఆహార విధానంలో మార్పులు చేయవచ్చన్నారు. చిరుధాన్యాలతో ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. చిరుధాన్యాల పంటల విత్తనోత్పత్తి చేసుకోవడం వల్ల లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. తక్కువ కాల పరిమితిలో పండించే రకాలైన కొర్రలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలతో సాగు ఖర్చు తక్కువ కావడంతో పాటు రైతులకు లాభసాటిగా ఉంటుందని, సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులు దృష్టి సారించాలన్నారు. యాళ్లూరు సొసైటీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారులు సరళమ్మ, మంజువాణి, ఎంపీఎస్ రెడ్డి, ప్రభావతమ్మ, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ భేష్



రికార్డులను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహార పంపిణీ బాగుందని ఫుడ్‌సేఫ్టీ అధికారి కాశీంవలి తెలిపారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామ రెండవ అంగన్‌వాడీ కేంద్రంను గురువారం ఆయన అర్బన్ సీడీపీఓ చంద్రకళ, బండిఆత్మకూరు సూపర్‌వైజర్ నజీరతో కలిసి పరిశీలించారు. కందిపప్పు, పాలు, గుడ్లు, తదితర వాటి పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చేపడుతున్న పౌష్టికాహారం పంపిణీ బాగుందంటూ కితాబిచ్చారు. చిన్నారులు, తల్లులకు అందిస్తున్న పౌష్టికాహారంలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

నంద్యాల: ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని సంకల్ప్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 36 ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు ఇస్తున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామ పక్కీర్‌రెడ్డి, శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, బాలగంగాధర్ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, పీడీ అసోసియేషన్ నాయకులు ఏపీ రెడ్డి, ఏపీయూ ఎస్ఎంఏ నాయకులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు



శిరివెళ్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ మాధవరావు

శిరివెళ్ల: ఉగాది నాటికి జిల్లాలో 18,067 ఇళ్లలో గృహ ప్రవేశాలు జరగాలనేది లక్ష్యమని హౌసింగ్ ఈఈ మాధవరావు స్పష్టం చేశారు. ఆయన గురువారం స్థానిక జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు 46,139 పక్కా గృహాలు మంజూరుకాగా ఇప్పటివరకు 21,657 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. వీటిలో 10,380 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, మరో 4,069 ఇళ్లు తుది దశకు చేరుకున్నాయన్నారు. ఇప్పటివరకు రూ.298 కోట్ల బిల్లులను లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు వివరించారు. 97 జగనన్న కాలనీలలో తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించామన్నారు. ఏఈ అహమ్మద్‌బాషా, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, స్పందనలో వచ్చిన అర్జీలు వాటిలో పరిష్కారమైనవి పరిశీలించారు. విధి నిర్వాహన, హాజరులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే నాణ్యవంతంగా భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అలాగే ప్రత్యేక పాఠశాలలో కొనసాగుతున్న బడి, నాడు-నేడు పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పాములేటి వెంట ఉన్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టవల్సిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై అజెండాను అధికారులు చదివి వినిపించారు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డులోని సమస్యలను చైర్మన్, కమిషనర్ దృష్టికి తెచ్చారు. కొన్ని వార్డులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే రాక

రుద్రవరం: ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి శుక్రవారం రుద్రవరానికి రానున్నట్లు ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర కమిటీ సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య గురువారం తెలిపారు. గ్రామంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల మండపంలో మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

ఎన్నిక

నంద్యాల(రూరల్): మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బెల్లం రాజ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ కార్యదర్శి చెన్నయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో నంద్యాల జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా అన్నపురెడ్డి దేవదాస్, ఉపాధ్యక్షులుగా రాముడు, రామసుబ్బయ్య, తాలూకా అధ్యక్షుడిగా ఓబులేసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులను జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు అభినందించారు.

బాచేపల్లిలో పొలంబడి



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

ఆళ్లగడ్డ: మండలంలోని బాచేపల్లి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించినట్లు ఏఓ కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంటలో ఒక చదరపు మీటర్‌లో నాటిన మొక్కలను లెక్కించి మహిళా రైతులకు వివరించారు. మొక్కల ఆకుల కత్తిరింపు ప్రయోగం చేయించినట్లు చెప్పారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించామన్నారు. సేంద్రియ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని ఆయన సూచించారు.